క్లుప్తంగా

తోలు బొమ్మలాట కళాకారులకు సత్కారం



తోట బాలకృష్ణ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: ప్రసిద్ధి చెందిన తోలు బొమ్మలాట కళాకారులైన తోట బాలకృష్ణ దంపతులను కలెక్టర్ షాన్ మోహన్ సోమవారం సత్కరించారు. తోలు బొమ్మలాటపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, ఉచితంగా శిక్షణ ఇస్తున్న కాకినాడ రూరల్ జమున నగర్‌కు చెందిన తోట బాలకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి, ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ శాంతి మండలి (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్) పాండిచ్చేరిలో ఇటీవల కళారత్న అవార్డు ప్రదానం చేసింది. ప్రాచీన కాలం నుంచి అత్యంత ప్రజాదరణ పొంది, ప్రస్తుతం అంతరించి పోతున్న తోలు బొమ్మలాటను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ద్వారా దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, బాలకృష్ణ దంపతులు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వీరు తోలు బొమ్మలాట కళలో అత్యంత ప్రావీణ్యం సంపాదించారని కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రదానం చేసిన జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని బాలకృష్ణ దంపతులకు కలెక్టర్ షాన్ మోహన్ అందజేసి అభినందించారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

బోట్‌క్లబ్: బ్రాహ్మణుల ఐక్యతను చాటుకోవడం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి అవకాశం ఉంటుందని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘ నూతన కార్యాలయాన్ని స్థానిక అశోక్‌నగర్‌లో సోమవారం ప్రారంభించారు. అన్ని కార్యక్రమాలలో బ్రాహ్మణుల సేవలు కోరుకుంటారని, వారి సమస్యలపై ఎవరూ స్పందించరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేద బ్రాహ్మణులకు నెలసరి స్వయంపాక కిరాణా సామాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ, తనికెళ్ల వెంకటరామయ్య శర్మ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



చింతపల్లి సుబ్బారావును సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట, ఏపీఐఐసీ కాలనీలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ దేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథం జయంతిని పురస్కరించుకుని ఏటా జాతీయ గ్రంథాలయ దినోత్సవం జరుపుతున్నామన్నారు. గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం ఆయన కృషి చేశారన్నారు. గ్రంథాలయ పాలక వృత్తి దైవంగా, పనే జీవితంగా గడిపిన గొప్ప వ్యక్తి అని ప్రస్తుతించారు. ఆయన 60 పుస్తకాలకు పైగా రచించడంతో పాటు, రెండు వేలకు పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారని తెలిపారు. ఈ సందర్భంగా చింతపల్లి సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అడబాల రత్న ప్రసాద్, రాజా పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ ఏఓగా త్రినాథరావు



ఏఓ త్రినాథరావు

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలనాధికారిగా పితాని త్రినాథరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జానపద కళాకారుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ: జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక సోమవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా వీర్నాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తోట పవన్‌కుమార్, జిల్లా కోశాధికారిగా వేర్నాల ప్రకాష్, గౌరవాధ్యక్షుడిగా పుల్లారావు, సలహాదారులుగా వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, తోట బాలకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. ఈ నెల 22న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న 30కి పైగా కళారూపాలతో కాకినాడ నగరంలో కలెక్టరేట్ నుంచి ఉదయం 10 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తోలు బొమ్మలాట సీనియర్ కళాకారుడు తోట బాలకృష్ణ దంపతులను సత్కరించారు.

ఇది ఓ వారధి వ్యథ

- తీరని కలగా తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వంతెన
- నిర్మాణం మొదలెట్టినా.. అసంపూర్తిగా మిగిలి..
- కాంక్రీట్ పిల్లర్లు శిథిలం, తుప్పు పట్టిన ఊచలు
- అంతా ఏకమై రూ.3 కోట్లు కొల్లగొట్టిన వైనం
- నోటీసులు ఇచ్చినా పట్టించుకోని కాంట్రాక్టర్

అన్నదాతకు చేయి అందించి, అండగా ఉందామనుకున్నా.. ప్రజల కష్టాన్ని తగ్గించి, కాస్త చేదోడు అవుదామనుకున్నా.. ఎన్నో గ్రామాలకు ప్రయోజనం కలిగించే వంతెనయై.. 'పటిష్టం'గా నిలబడి గౌరవం చాటుదామనుకున్నా.. పాలకుల స్వార్థానికి.. అధికార్ల నిర్లిప్తతకు బలైపోయా.. కడుపున పడిన బిడ్డ.. పురిటినొప్పులు రాకుండానే ఆయువు తీరినట్టు.. కనీసం పూర్తి కాకుండానే ఓ శిథిల కథగా మిగిలిపోయా.. ఇది కథ కాదు.. ఓ వారధి వ్యథ..



కొంగోడు వద్ద వంతెన నిర్మాణం చేపట్టిందిక్కడే..



పునాది లెవెల్‌లోనే పెచ్చులూడి, శిథిలమవుతున్న పిల్లర్లు



కాంక్రీట్ ధ్వంసమై పిల్లర్‌లో తుప్పు పట్టిన ఊచలు

కరప: తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద చేపట్టిన వంతెన నిర్మాణం కలగా మిగిలింది. నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి ఆరున్నరేళ్లయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని రైతులు పెదవి విరుస్తున్నారు. చేసిన కాస్త పనికి రూ మూడు కోట్ల వరకు దండుకున్నారని, అవెందుకూ అక్కరకు రావన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు వేసిన పిల్లర్ల కాంక్రీట్ కూడా కొట్టుకుపోయి, ఊచలు బయటకొచ్చి తుప్పుపట్టాయి. వంతెన పనులు పునః ప్రారంభించినా, భూమి లెవెల్ వరకూ వేసిన పిల్లర్లు పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

నిరాశే మిగిలింది


పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి, పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు వంతెన ప్రయోజనకరంగా ఉంటుందనుకుంటే నిరాశే ఎదురవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలు వంతెన నిర్మాణానికి శంకుస్థాపనకు హడావిడి చేశారు కానీ, ఆ తర్వాత పనులు చేయించడంలో ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో పనులు జరగలేదని మూడు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. నాలుగున్నరేళ్లుగా పనులు నిలిచినా పట్టించుకోని డ్రెయినేజీ శాఖాధికారుల పనితీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా విడిచిపెట్టి..

కొంగోడు వంతెన నిర్మించాలని రైతులు, ప్రజల ఆకాంక్షగా ఉండేది. 2017లో అప్పటి ప్రభుత్వం రూ.5.19 కోట్లు మంజూరు చేయగా, అదే ఏడాది డిసెంబర్ 30న ఎన్టీఆర్ వారధి పేరిట అప్పటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అట్టహాసంగా వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. భూమి లెవెల్ వరకు నాలుగు పిల్లర్లు వేశారు. తర్వాత నుంచి పని అసంపూర్తిగా వదిలేశారు.

అక్కరకు రాని పరిస్థితి

చాలాకాలం నుంచి పనులు చేయకపోవడంతో పిల్లర్లకు వేసిన ఊచలు తుప్పుపట్టి పోయాయి, పిల్లర్ల సిమ్మెంట్ కాంక్రీటు కూడా పెచ్చులూడిపోతోంది. ఈ పిల్లర్లపై వంతెన నిర్మించినా, పటిష్టంగా ఉండదని నిపుణులు చెబుతున్నారు. వంతెన పటిష్టంగా ఉండాలంటే, ముందు వేసిన పిల్లర్లు తొలగించి, మళ్లీ కొత్తగా నిర్మించాల్సి ఉంటుందని అంటున్నారు. వంతెన నిర్మాణానికే రూ.5.19 కోట్లు మంజూరు చేస్తే, భూమి లెవెల్ వరకు చేసిన దానికి రూ.3.01 కోట్లు చెల్లించినట్టు అధికారుల అంటున్నారు. వంతెన నిర్మాణ పనులు ఆగిపోతే డ్రెయినేజీ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండే కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభింపచేసి, పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద వంతెన నిర్మాణానికి వేసిన శిలా ఫలకమిదే.

ప్రయోజనాలెన్నో..!

కరప మండలం కొంగోడు గ్రామ రైతులకు చెందిన పొలాలు వేములవాడ, కరప శివారుల్లో ఉంటాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు రాకపోకలు సాగించాలన్నా, పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా తుల్యభాగ డ్రెయిన్‌ను దాటాల్సి ఉంటుంది. అటు కాజులూరు మండలవాసులు కరప మండలం రావాలన్నా కొంగోడు మీదుగా తుల్యభాగ డ్రెయిన్ దాటాల్సిందే. పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా, దమ్ము ట్రాక్టర్లు వెళ్లాలన్నా ఆరు కి.మీ. చుట్టూ తిరిగి.. గొర్రిపూడి మీదుగా ఏటిగట్టు రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అదే తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద వంతెన నిర్మిస్తే, రైతులకూ, రెండు మండలాల వారికీ దగ్గర దారిగా ఉంటుంది.

నిలిచిపోవడం వాస్తవమే: డ్రెయినేజీ ఏఈఈ

తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంపై డ్రెయినేజీ శాఖ ఏఈఈ కె.కీర్తిని వివరణ కోరగా, వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడం వాస్తవమేనన్నారు. తాను ఇక్కడికి వచ్చేసరికే, చేసిన పనులకు ఐదు బిల్లులుగా రూ 3.01 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. 2019 నుంచి పనులు జరగడం లేదన్నారు. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు రెండు నెలలకోసారి నోటీసులు ఇస్తున్నా స్పందించడం లేదన్నారు. జూలైలో నోటీసు ఇవ్వగా పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఏఈఈ కీర్తి తెలిపారు.

చర్యలు తీసుకోవాలి



కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఆరేళ్లు పైబడినా పునాది లెవెల్‌లోనే ఉండిపోయింది. వంతెన నిర్మాణం పూర్తికాక రైతులకు ఇబ్బందికరంగా ఉంటోంది. రైతులకు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే ఈ వంతెన నిర్మాణం పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోట వెంకటేశ్వరరావు, కొంగోడు

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

కమిషనర్ భావన పిలుపు



బయోక్రక్స్ ప్లాస్టిక్ వాషింగ్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన పిలుపునిచ్చారు. సర్వారాయ సుగర్స్ లిమిటెడ్ బాట్లింగ్ యూనిట్ వేమగిరి వారి సౌజన్యంతో కోకోకోలా కంపెనీ అందజేసిన బయోక్రక్స్ ప్లాస్టిక్ వాషింగ్ మెషీన్‌ను సోమవారం కమిషనర్ భావన ప్రారంభించారు. మెషీన్ పనితీరును తెలుసుకున్నారు. కాకినాడ నగర ప్రజలు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా, ఈ మెషీన్‌లో వేయాలని సూచించారు. ఇప్పటికే ఈ మెషీన్లను కాకినాడ ఆర్టీసీ బస్టాండ్, మడ అడవులు, వికేకానంద పార్కులో ఏర్పాటు చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, కంపెనీ ప్రతినిధులు బి.అప్పన్నదొర, పి.వెంకటేశ్, కె.నాగేశ్వరరావు, ఏ.శివశంకర్, కె.కృష్ణ కిశోర్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో ముంపు సమస్యపై దృష్టి

నగరంలోని జనవాసాల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షపు, మురుగునీరు నిలిచిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత వాటి యజమానులపై ఉందని కమిషనర్ భావన అన్నారు. పారిశుధ్య నిర్వహణ తనిఖీల్లో భాగంగా ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా నాలుగు, తొమ్మిది సర్కిళ్లలో ప్రైవేటు ఖాళీ స్థలాలను పరిశీలించారు. యాంటీ లార్వా యాక్టివిటీస్‌లో భాగంగా డ్రోన్స్ స్ప్రే క్లీనింగ్ ప్రతిపాదనపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టిడ్కో గృహాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ నెల 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్న నేపథ్యంలో, వివేకానంద పార్కు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు.

భవన నిర్మాణ బకాయిలు ఇవ్వండి

కమిషనర్‌కు కాంట్రాక్టర్ల వినతి



కాంట్రాక్టర్ల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో కొమరగిరిలో నిర్మించిన గృహ నిర్మాణాలకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావనకు కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం కార్పొరేషన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలువురు కాంట్రాక్టర్లు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గృహ నిర్మాణాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేలు బ్యాంకుల ద్వారా సమకూర్చారని, ఆ మేరకు లబ్ధిదారులతో అగ్రిమెంట్ కూడా పూర్తయిందన్నారు. నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్నాయని, అయితే డ్వాక్రా సభ్యుల నుంచి రావలసిన బకాయిలు మాత్రం మంజూరు చేయలేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే బకాయిలను వసూలు చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని కమిషనర్‌ను కోరారు. కాగా డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఫోన్ ద్వారా 15 మంది సమస్యలు విన్నవించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా 23 మంది నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదులు అందజేశారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారానికి కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్, సీసీఆర్సీ ప్రక్రియ వేగవంతం

అధికారులకు కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో సాగు ఉత్పత్తిని పెంచడంతో పాటు ఈ–క్రాప్ బుకింగ్, సీసీఆర్సీ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల క్షేత్రస్థాయి కార్యకలాపాలపై వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్య, మైక్రో ఇరిగేషన్, లీడ్ బ్యాంక్ శాఖల అధికారులతో కలిసి, తహసీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు ఉత్పత్తి పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారీ రైతుల ఏఏ వరి రకాలు సాగు చేసుకున్నారో వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సాగుదారుడికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఈ–క్రాప్ బుకింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు పత్రాల ప్రక్రియ వేగవంతం చేసి రుణాలు మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డు అందేలా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, జేడీఏ ఎన్ విజయకుమార్, మత్స్యశాఖ అధికారి కె కరుణాకర్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి ఎం మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ పీడీ జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ విడుదల

జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సాధికారిత అధికారి కె ప్రవీణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా మత్తులో జగత్తు జీవితం చిత్తు అనే అంశంపై పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ యువతను చెడు మార్గాల్లో మళ్లించడంలో మాదక ద్రవ్యాల పాత్ర తీవ్రమైందన్నారు. విద్యార్థులు, యువకులు చదువుకు దూరమై, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. తీవ్ర ఆరోగ్య సమ్యలు ఎదురవుతాయన్నారు. మాదక ద్రవ్యాలు అమ్మిన వారిపై, తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సీడీపీఓలు పాల్గొన్నారు.

విధులు, బాధ్యతలపై అవగాహన అవసరం



కరపలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సర్పంచ్‌లు, అధికారులు

కరప: పంచాయతీల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించుకుని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తూ, పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా తరగతులను ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం, పంచాయతీలు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. పంచాయతీ పరిపాలన, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పారిశుధ్య పనులు, ఘనవ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఎల్ఈడీ వీధిలైట్ల నిర్వహణ తదితర అంశాలపై ఈఓపీఆర్డీ సత్యనారాయణ, వి.సునీల్‌కుమార్ శిక్షణా తరగతులు నిర్వహించారు. తొలుత గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు సర్పంచ్‌లు, అధికారులు నివాళులర్పించారు. ఏఓ జి.భీమశంకరరావు పాల్గొన్నారు.

లారీని దొంగిలించుకుపోతూ..

కాకినాడ క్రైం: చోరీకి గురైన లారీ మరోచోట ప్రమాదానికి గురై దొంగతో పాటు పట్టుబడిన ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు, స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన లోకవరపు గంగాధర్‌రావు ఈ నెల 10న తన లారీని వార్ఫ్ రోడ్‌లో పార్కింగ్ చేశారు. మరుసటి రోజు ఉదయం చూసుకునే సరికి లారీ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తి నకిలీ తాళాలతో అతడి లారీని దొంగిలించి, మార్గంలో యాంకరేజ్ పోర్టు గోడను ఢీకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మరుసటి రోజు నిందితుడిని అరెస్టు చేసి, లారీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవ మనుగడ



విద్యార్థులను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ మురళీకృష్ణ

కాకినాడ సిటీ: జీవ వైవిధ్య పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జేఎన్‌టీయూ సెనెట్ హాలులో ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు వక్తృత్వం, డిబేట్, లఘు చిత్రాల పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు 208 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడ కూడా సాధ్యమన్నారు. మొక్కలు నాటడం జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. మండలి ప్రాంతీయ సమన్వయకర్త సత్యప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి ఎం శ్రీనివాస్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయ కర్త కేవీకే మహేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు కె కిరణ్ కుమార్, ఎస్ వీరభద్రరావు, కె వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కాకినాడ రూరల్: ఒకసారి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే దాని కబంధ హస్తాల నుంచి బయటపడడం చాలా కష్టమని, భవిష్యత్తు పూర్తిగా నాశనమవుతుందని డీఎల్‌డీఓ నారాయణమూర్తి అన్నారు. కాకినాడలోని రమణయ్యపేటలో ఏపీఎస్పీ క్వార్టర్స్, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్‌లో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని వ్యతిరేకిస్తూ ధవళేశ్వరానికి చెందిన డిస్ట్రిక్ట్ డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్ వారి స్వచ్ఛంద సేవా సంస్థ పుష్కర మాత కాన్వెంట్ కమిటీ నిర్వహణలో మహత్తర కార్యక్రమం చేపట్టారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తూ, యువతను నిర్వీర్యం చేస్తున్నది మహమ్మారి మాదకద్రవ్యాలేనన్నారు. కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఏఎంఓ రామారెడ్డి, ఎంఈఓ ఏసుదాస్, హెచ్ఎం కోటంరాజు గాయత్రి మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియాకు విద్యార్థులు,, యువతే లక్ష్యమని, తమ దందా కోసం దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. చివరికి బిస్కెట్లు, చాక్లెట్ల రూపంలో కూడా డ్రగ్స్ విరివిగా లభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటికి బానిసలు కాకూడదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు పులవర్తి వెంకట సూర్యప్రకాష్, గోకరకొండ నాగేశ్వరరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు సూరిబాబు ఆధ్వర్యంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి సత్యవోలు శ్రీనివాస్, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ కన్నూరి జోగిరెడ్డి, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజు, డిస్ట్రిక్ట్ డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్ పీడీ పి.సుందరరాజు, ప్రాజెక్ట్ మేనేజర్ పి.సుధారాణి, కో–ఆర్డినేటర్ ఐ.సోంబాబు, కౌన్సిలర్ పి.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ధర్నా

కాకినాడ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, శానిటేషన్ కార్మికులుగా, సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న కంటింజెంట్ కార్మికులకు బకాయి పడిన ఆరు నెలల వేతనాలు తక్షణం చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తునిలో స్థానిక అధికార పార్టీ పెద్దలు చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు.

సామూహిక సీమంతాలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆంజనేయ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ వై.లక్ష్మి, న్యాయవాది పెండెం శ్రీదేవి, సూపర్‌వైజర్ పి.మార్తమ్మ పర్యవేక్షించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 14 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, 47 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా వేస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్‌మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. అలాగే మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఐదుగురికి ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు శిక్ష, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.

సంఘానితో వారికి సంబంధం లేదు

కాకినాడ సిటీ: ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చెప్పుకుంటున్న ఎస్ చంద్రశేఖర్, సుబ్బ నారాయణకు సంఘానికి ఎటువంటి సంబంధం లేదని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సవరపు చినపాపారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కండవల్లి చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు ముక్కే రామకృష్ణ సోమవారం కాకినాడలో విలేకర్లకు తెలిపారు. 2022 నవంబర్‌లోనే వీరిని పదవుల నుంచి తప్పించినట్టు చెప్పారు. చంద్రశేఖర్, నారాయణతో ఎటువంటి లావాదేవీలు జరపవద్దని, వారికి సంఘానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వీరు నగరంలో ఉన్న సంఘ భవనానికి వచ్చి అద్దెలను వినియోగించుకుంటున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

కోనేరు పార్కు అభివృద్ధి చేయాలి

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి ఆలయం కోనేరు పార్కు చిట్టడవిగా తయారైందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. పార్కును అభివృద్ధి చేయాలని సోమవారం ఆయన కమిషనర్ భావనకు ఫిర్యాదు చేశారు. చెరువు నీరు జంతు వ్యర్థాలతో ఆకుపచ్చగా, దుర్గంధంగా ఉందని, మోటార్లతో కలుషిత నీరు తోడించాలన్నారు. తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించి, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలన్నారు. చెరువు లోపల విద్యుత్ స్తంభాలు, దీపాలు విరిగి పోయాయని, వాటి స్థానంలో కొత్తవి అమర్చాలన్నారు. కోనేరు నాలుగు వైపులా ప్రతిష్ట చేసిన దేవతామూర్తుల శిలా విగ్రహాలకు రక్షణ లేకుండా ఉందన్నారు. చెరువు బయట విష వృక్షాలుగా పేరొందిన కోనోకార్పస్ పర్యావరణానికి కీడు చేస్తున్నాయన్నారు. ఆలయానికి వెళ్ళే బాదంవారి వీధి, రామాలయం వీధుల్లో వీధి దీపాలు సగానికి పైగా వెలగడం లేదన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి

బోట్‌క్లబ్: హిందువులకు రక్షణ కల్పించాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు కోరారు. బంగ్లాదేశ్‌లో ఈ దాడులపై వేదిక ఆధ్వర్యంలో సోమవారం భానుగుడి సెంటర్‌లో నిరసన తెలిపారు.